చైర్మన్ ఎంపికలో వీడని ఉత్కంఠ

- పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ ఎంపికలో పోటీ
- ప్రాధాన్యం కోసం జనసేన పట్టు
- ఎమ్మెల్యే వద్దకు ధర్మకర్తల మండలి సభ్యుల పేర్లు
- సంవత్సరానికి చైర్మన్ ఒకరంటూ ప్రచారం



రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: ప్రతిష్ఠాత్మకమైన శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి ఎంపిక విషయం రోజుకో మలుపు తిరుగుతూ ఉత్కంఠ రేపుతోంది. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పేరంటాలమ్మకు ఉభయ జిల్లాల్లో వేల సంఖ్యలో భక్తులు ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న పేరంటాలమ్మ ఆలయానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ ధర్మకర్తల మండలిని నియమించకపోవడంతో ఆలయంలో నిర్వహించే పెద్ద పండుగలైన దసరా, సంక్రాంతి, ఇతరత్రా కార్యక్రమాలపై ప్రభావం పడుతోంది. దీంతో ఆలయానికి ధర్మకర్తల మండలిని ఎప్పుడు నియమిస్తారోనని భక్తులు, కూటమి నాయకులు ఎదురు చూస్తున్నారు. ధర్మకర్తల మండలి లేకుండా గత దసరా, సంక్రాంతి పండుగల్లో నిర్వహణ, పర్యవేక్షణ లోపించడంతో అబాసుపాలయ్యారని పలు గ్రామాల్లోని భక్తులు విమర్శిస్తున్నారు.

పదవి కోసం పోరు

ఆలయానికి గత ధర్మకర్తల మండలి రాజీనామా చేసి సుమారు 10 నెలలకు పైగా కావోస్తోంది. అప్పటి నుంచి ఆలయ చైర్మన్ పదవి కోసం ఎవరి పందాలో వారు పావులు కదుపుతున్నారు. గ్రామ టీడీపీలో నాయకులు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో చైర్మన్‌గా ఎవరిని నియమించాలనేది స్పష్టత రావడం లేదు. మరో వైపు జనసేన నాయకులు చైర్మన్ ఎంపికలో తమకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని పట్టు పడుతున్నారు. కాంట్రాక్టు పనులన్నీ టీడీపీ నాయకులే చేజిక్కించుకుంటున్నారని, నామినేటెడ్ పోస్టులకు కూడా ఎసరు పెడితే ఎలా ఊరుకుంటామని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల గ్రామంలో జనసేన పార్టీ జెండా దిమ్మెను నిర్మించగా టీడీపీ నాయకులే ధ్వంసం చేశారని గుర్తు చేస్తున్నారు. కాగా టీడీపీ నుంచి చైర్మన్ రేసులో పట్టపు చంటి, మత్తె రాధా కుమార్, తంబాబత్తుల క్రాంతి, కళ్లెపల్లి సాయిరామరాజు పోటీ పడుతున్నారు.

సంవత్సరానికి ఒకరు..

ఆలయ చైర్మన్ పదవికి నలుగులు పోటీ పడుతుండగా కొత్త అంశం తెరపైకి వచ్చింది. సంవత్సరానికి ఒకరు చొప్పున నాలుగు సంవత్సరాలకు నలుగురికి చైర్మన్ పదవి పంపకం చేస్తామంటూ టీడీపీ నాయకులు హడావుడి చేస్తున్నారు. ధర్మకర్తల మండలికి 11 మంది సభ్యుల జాబితాను తయారు చేసి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు పంపించారని ప్రచారం జరుగుతోంది. పక్క గ్రామం ప్రసాదంపాడులో ఇద్దరి పేర్లు, జనసేన నుంచి ఇద్దరు చొప్పున పంచి మిగిలిన ఏడుగురు సభ్యులను టీడీపీ నుంచి ఖరారు చేశారు. దీంతో జనసేన నాయకులు చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యుల అంశంలో కూడా తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నారు. పట్టపు చంటికి మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం మత్తె రాధాకుమార్, మూడు, నాలుగు సంవత్సరాలకు క్రాంతికుమార్, సాయిరామరాజులకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

ఇద్దరికి వేరే అవకాశాలు..

మరో పక్క సాయి రామరాజుకు బంధువైన వార్డు సభ్యులు అద్దేపల్లి సాంబశివనాగరాజును ఇటీవల ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఒకే సామాజిక వర్గం నుంచి ఇద్దరికి పదవులు ఎలా ఇస్తారంటూ సొంత పార్టీ వారే ప్రశ్నిస్తున్నారు. ఉపసర్పంచ్ పదవి కట్టబెట్టినందుకు ఆలయ చైర్మన్ పదవి రేసులో మరొకరికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల టెండర్‌ను తంబాబత్తుల క్రాంతికుమార్‌కు కట్టబెట్టారు. దీంతో ఈయన స్థానంలో కూడా మరొకరికి అవకాశం ఇవ్వాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎటూ తేల్చని ఎమ్మెల్యే

పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ విషయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ ఎటూ తేల్చకుండా జాప్యం చేస్తున్నారు. చైర్మన్ రేసులో ఉన్నవారు మాత్రం ఎవరికి వారు తామే చైర్మన్ అంటూ ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్ ఎంపిక విషయంలో నాయకులంతా ఏకాభిప్రాయానికి రావాలని ఎమ్మెల్యే పదే పదే చెబుతున్నా అటువంటి పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. దీంతో ఆశావహులు ఎమ్మెల్యే యార్లగడ్డ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు ఏది ఏమైనా రాజకీయాలను పక్కన పెట్టి ఆలయ అభివృద్ధికి పాటు పడే సమర్థవంతమైన వారికి చైర్మన్ పదవి కట్టబెట్టాలని ఆయా గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అనధికార నిర్మాణాల కూల్చివేత



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అనధికారికంగా చేస్తున్న నిర్మాణాలను మున్సిపాలిటీ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. యనమలకుదురు, కానూరు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న పైఅంతస్తులను టీడీపీ అరుణ, సిబ్బంది కూల్చి వేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన హ్యాకథాన్



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత రెండు రోజులుగా జరుగుతున్న అమరావతి క్వాంటం హాకథాన్–2025 బూట్‌క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఏపీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో బూట్‌క్యాంప్ 2025ని జరిపారు. చివరి రోజు శ్రీకృష్ణదేవరాయ ప్రొఫెసర్ డాక్టర్ సి.చంద్రమౌళి, బిట్స్ పిలాని ప్రొఫెసర్ ఇంద్రాక్షి రే చౌదరి, క్వాన్‌ఫ్లూయెన్స్ సీఈవో సోజోయ్ చక్రవర్తి, క్వాంటం రీసెర్చ్ సాఫ్టవేర్ ఇంజినీర్ రుషికేష్‌ఉబలే ఆన్‌లైన్‌లో పాల్గొని మాట్లాడుతూ అమరావతిని డీప్ టెక్ పరిశోధన, ఆవిష్కరణలకు భవిష్యత్తు కేంద్రంగా రూపొందించాలన్నారు. అమరావతి క్వాంటం హ్యాకథాన్ సెమీఫైనల్స్ సెప్టెంబర్ 10వ తేదీన ధనేకుల కాలేజీలో నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డైరెక్టర్ రవి ప్రసాద్, 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

29 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పెనమలూరు: పోరంకి గ్రామంలో అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ఉషారాణి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పోరంకి ప్రభునగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందటంతో గురువారం రాత్రి తనిఖీలు చేశామన్నారు. అయితే కేసరపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి సత్యనారాయణ, దుంగ రామకృష్ణ, ఆటో డ్రైవర్ ఎలుకెపల్లి సాయిబాబుతో కలిసి 29 బియ్యం బస్తాలు (1025 కేజీలు) ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ఆటోను సీజ్ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.

గాజుల అలంకరణలో పేరంటాలమ్మ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దాతలు, భక్తులు అందజేసిన గాజులతో అమ్మవారిని ప్రీతికరంగా అలంకరిచారు. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల్లోని భక్తులు వేకువజాము నుంచే అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



గన్నవరం: యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. యూరియా కోసం పీఏసీఎస్‌లు, ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ దుకాణాల వద్ద రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. గన్నవరంలో శుక్రవారం ఒక ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం వందలాది మంది రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ నిబంధనల మేరకు అన్నదాతలు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, కౌలుకార్డు వెంట తీసుకుని క్యూకట్టారు. ఇచ్చే రెండు, మూడు బస్తాల యూరియా కోసం పనులు మానుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ గ్రామంలో సాయినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా సాయినగర్, పుట్ట రోడ్డు, మాదు తిరుపతిరావు నగర్, టవర్ రోడ్డు, శివపార్వతీనగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయని సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాలు కనుచూపు మేర కనిపించడం లేదు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. విడవకుండా వర్షాలు కురుస్తూ రెండు రోజుల విరామం తర్వాత డ్రైనేజీ కాల్వల్లో, గుంటల్లో వర్షం నీరు నిలబడడంతో దోమలు ఉధృతంగా ఉంటున్నాయి. అంతేకాక వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా దగ్గు, గొంతునొప్పి వ్యాధులకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. నున్న గ్రామంలో మూడు సచివాలయాల పరిధిలో రెండు ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటిల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నా వారందిస్తున్న సేవలు నామ మాత్రమేనని విమర్శలు వస్తున్నాయి. వ్యాధులతో ఆరోగ్య కేంద్రాలకు వెళ్లిన వారికి మందుబిళ్లలు లేవని ప్రజానీకం చెబుతున్నారు.

రక్త దానంలో భాగస్వాములు కావాలి



కానూరులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పెనమలూరు: రక్తదానంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, బ్రహ్మకుమారి రాజయోగిని సంయుక్తంగా విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రక్తదానం చేయటం వలన ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడగలుగుతామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవపై దృష్టి పెట్టాలని తెలిపారు. గుంటూరు మాజీ జెడ్పీ చైర్మన్, బీజేపీ నేత పాతూరి రామారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించటం వలన నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఈ సందర్భంగా 230 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, డీన్.డి.వెంకట్రావు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ పి.సుష్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పుష్పార్చన



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం ఐదో శుక్రవారం సందర్భంగా లక్ష గులాబీలతో పుష్పార్చన జరిపారు. తొలుత అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సన్నిధిలో లక్ష గులాబి పుష్పాలు, కమల పుష్పాలతో భక్తిశ్రద్ధలతో అర్చన జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మాను (మహాలక్ష్మీ)కు పూజలు నిర్వహించిన భక్తులు గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. ఈ సందర్భంగా యూఎస్‌ఏకు చెందిన పాలడుగు సాయిస్వరూప్, భవిత దంపతుల సౌజన్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం భక్తులచే శ్రీలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణం, లక్ష్మీఅష్టోత్తరం, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు కమిటీ సభ్యులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

పాతపాడులో స్వామిత్వ సర్వే



పాతపాడు గ్రామంలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాతపాడు(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పాతపాడు గ్రామంలో సచివాలయం సిబ్బంది స్వామిత్వ సర్వే చేస్తున్నారు. గ్రామ కంఠంలో ఇళ్లను సర్వే చేస్తున్నారు. ఇంటి కొలతలు, స్థలం కొలతలు కొలుస్తూ సరిహద్దుల వివరాలను నమోదు చేస్తున్నారు. పాతపాడు గ్రామంలో సుమారు 350 ఇళ్ల కొలతలు సేకరించినట్లు సిబ్బంది చెప్పారు. కొలతల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నారు. గ్రామం మొత్తం సర్వే పూర్తయిన అనంతరం ఐడి కార్డును ఇంటి యజమానికి ఇవ్వడం జరుగుతుందని చెబుతున్నారు. పాతపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, విలేజి సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంటు, ఇతర సచివాలయాల సిబ్బంది స్వామిత్వ సర్వేలో పాల్గొంటున్నారు. ఈ నెలాఖరు నాటికి గ్రామంలో సర్వే పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాతపాడు గ్రామంతో పాటు అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నారు.

ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు



ఉయ్యూరు సెంటరులో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

ఉయ్యూరు: అనాలోచిత నిర్ణయాలతో ఆటో కార్మికుల పొట్ట కొట్టడం సరికాదని, ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పోలినాయుడు అన్నారు. ఆటో కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో ఉయ్యూరు ప్రధాన సెంటరులో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పోలినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు అమలు చేయటంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆటో కార్మికుల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలతో ఆటో రంగం కుదేలైందన్నారు. తాజాగా ఫ్రీ బస్సు పథకంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కూడా చెల్లించలేని దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.రాజేష్, పోతురాజు, ప్రభాకర్‌రావు, చంటి, శ్రీనివాసరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



వేలేరులో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీమన్నారాయణ ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. భగవద్గీత శ్లోక పారాయణం, విశేష పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ వీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీకృష్ణుడి నిలువెత్తు ప్రతిమను ఊరేగించారు. వైభవంగా జరిగిన గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు భక్తి పారవశ్యంతో భజనలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణస్వామి, అరుణ్‌కుమార్, వేములపల్లి శ్రీనివాసరావు, ఝాన్సీలక్ష్మి, తారక రామకృష్ణ, ప్రశాంతి, లక్ష్మణ్, భరత్, నర్మద, హితాక్ష పాల్గొన్నారు.

జాతీయ రహదారి ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



గన్నవరంలో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు

గన్నవరం: జాతీయ రహదారికి ఇరువైపులా పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దుకాణదారులు ఫుట్‌పాత్ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

40 కి.మీ మేర..

చెన్నై– కొల్‌కతా జాతీయ రహదారి నియోజకవర్గంలో రామవరప్పాడు నుంచి బొమ్ములూరు వరకు సుమారు 40 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. పాతికేళ్ల క్రితం జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించిన తర్వాత పాదచారులు నడిచేందుకు వీలుగా ప్రతి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. అప్పట్లో ఈ ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేవి.

పర్యవేక్షణ లోపం

అయితే ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫుట్‌పాత్‌లు క్రమంగా ఆక్రమణల చెరలోకి చిక్కుకున్నాయి. జాతీయ రహదారి పక్కనే ఉన్న దుకాణదారులు ఫుట్‌పాత్‌లను వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

ఆక్రమించి..అద్దెకిచ్చి..

మరి కొంత మంది దుకాణదారులు అయితే ఫుట్‌పాత్‌లను టీస్టాల్స్, హోటల్స్, బడ్డీకోట్లకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గన్నవరం, పెద్ద ఆవుటపల్లి, తేలప్రోలు, హనుమాన్‌జంక్షన్, పలు గ్రామాల్లో ఫుట్‌పాత్‌లు నామరూపాలు లేకుండాపోయాయి. మరి కొన్ని చోట్ల అండర్ గ్రౌండ్ ఫైబర్ నెట్ వైర్ల కోసం ఫుట్‌పాత్‌లను తవ్వివేశారు. ఎయిర్‌పోర్ట్ క్యారిడార్ నిర్మాణం నిమిత్తం ఎయిర్‌పోర్ట్ నుంచి రామవరప్పాడు వరకు ఫుట్‌పాత్‌లను పునర్నిర్మించడంతో ఆక్రమణలకు అడ్డుకట్టపడింది.

ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు..

ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో పాదచరులు తప్పనిసారి పరిస్థితుల్లో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల జాతీయ రహదారిపై వేగంగా దూసుకుపోయే వాహనాలు ఓవర్‌టేక్ చేసే క్రమంలో రోడ్డు పక్కన నడుచుకుని వెళ్లే పాదచారులను ఢీకొడుతున్నాయి. ఈ తరహా సంఘటనలు జాతీయ రహదారిపై నిత్యకృత్యంగా మారాయి.

స్పందించాలని వినతి

ఇప్పటికైన ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్, పంచాయతీ అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనికోసం ఎన్‌హెచ్ ఏఐ, పోలీసులు, గ్రామపంచాయతీ అధికారులు గతంలో మాదిరిగా ఉమ్మడిగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని పేర్కొంటున్నారు.

'మానవత' అవిర్భావ దినోత్సవ ర్యాలీ



హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారిపై మానవత సభ్యుల ర్యాలీ

గన్నవరం: మానవత స్వచ్ఛంద సంస్థ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మానవత కార్యాలయం నుంచి బయలుదేరిన ప్రదర్శన బస్టాండ్, కొత్తపేట, పోలీస్‌స్టేషన్, గాంధీచౌక్, సినిమాహాల్ సెంటర్ వరకు కొనసాగింది. ఇటీవల ప్రమాదంలో గాయపడిన కార్మికుడు చింతలపూడి వరప్రసాద్ కుటుంబానికి నిత్యావసర సరకులు, రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌కు విద్యార్థుల సౌకర్యార్థం 25 చాపలు, మూడు కూలింగ్ వాటర్ క్యాన్లు, రెండు చార్జింగ్ లైట్లు బహూకరించారు. పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా మానవతా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని గన్నవరం శాఖ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కోశాధికారి పొ ట్లూరి రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, సభ్యులు గన్నె వెంకట్రావు, సయ్యద్ లాల్ పాల్గొన్నారు.

శాంతియుత జీవనం సాగించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజలంతా శాంతియుత జీవనం సాగించాలని కోరుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మానవత అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున మానవత సభ్యులు ర్యాలీకి హాజరయ్యారు. శాంతియుత జీవనం సాగించాలని, తోటివారి పట్ల మానవత్వం కలిగి ఉండాలని కోరుతూ నినాదాలు చేశారు. మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ 2004లో జంగారెడ్డిగూడెంలో 108 మంది సభ్యులతో విశ్రాంత అధ్యాపకులు రామచంద్రారెడ్డి ప్రారంభించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నేడు రాష్ట్ర వ్యాప్తంగా 136 శాఖలతో 85 వేల మంది సభ్యులతో విస్తరించిందని చెప్పారు. మానవత ద్వారా అంతిమయాత్ర నిర్వహణకు ఉచితంగా శాంతిరథం, ఫ్రీజర్ బాక్సులు, పేద విద్యార్థులకు ఆర్థికసాయం, కేరీర్ గైడెన్స్ నిర్వహించటం, పేద రోగులకు వైద్య సాయం అందించటం, పర్యావరణ పరి రక్షణ,రక్తదానం, అవయవదానంపై అవగాహన వంటివి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మానవత సినీయర్ సభ్యులు గంటా సత్యనారాయణ, గూడపాటి జయరామ చంద్రరావు, సత్యనారాయణ, దయాల ప్రభాకరరావు, పొట్లూరి శేషాచలం, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు .. పోరంకికి చెందిన కోటప్రసాద్ (50) గ్రామంలోని హోటల్‌లో పని చేస్తాడు. తన బైక్‌పై వెళుతుండగా తాడిగడప జంక్షన్ వద్ద 100 అడుగుల రోడ్డు వైపు నుంచి వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. దీంతో ప్రసాద్ తన బైక్‌పై నుంచి పడిపోవటంతో అపస్మారకస్థితికి చేరాడు. విజయబాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి కుమారుడు డానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన ఊయల నందిని, పల్లయ్య భార్యాభర్తలు. వీరిది ప్రేమ వివాహం కాగా ఒక కుమార్తె. కొంత కాలంగా పల్లయ్య భార్యను కట్నం డబ్బుల కోసం వేధింపులకు గురి చేసి పుట్టింటికి పంపేశాడు. పుట్టింటికి వెళ్లిన మూడు నెలలకు విడాకుల నోటీసులు పంపగా, కాపురానికి తీసుకువెళ్లాలని నందిని కోరింది. కాపురానికి తీసుకువెళ్లకుండా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అత్త, మావయ్యలకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.